సాక్షి నాగర్‌కర్నూల్

గురువారం । 14 । నవంబర్ । 2024



బాణం.. గురి తప్పదు

మహబూబ్‌నగర్ విద్యార్థులు ఆర్చరీ క్రీడలో విశేషంగా రాణిస్తున్నారు.

వివరాలు 8లో ▸



జోరుగా.. హుషారుగా

చిట్టెబోయిన్‌పల్లి గురుకులంలో జోనల్ క్రీడలు ఉత్సాహంగా కొనసాగాయి.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.3 /20.0

వాతావరణం

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది. మధ్యాహ్నం ఎండ.. రాత్రి చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

108, 102లో డ్రైవర్ ఉద్యోగాలకు అవకాశం

అచ్చంపేట: జిల్లాలో 108, 102 అంబులెన్స్‌లలో డ్రైవర్ ఉద్యోగాల భర్తీకి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు 108 సర్వీస్ జిల్లా మేనేజర్ శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి విద్యార్హత, 35 ఏళ్లలోపు వయసు కలిగిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లు, ఆధార్, ఒక సెట్ జిరాక్స్‌తో ఈ నెల 15న ఉదయం 10 నుంచి సాయంత్రం 3 గంటల వరకు అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రి 108 కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు. వివరాల కోసం 91007 99260 నంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

నూనె గింజల పంటలపై దృష్టి పెట్టాలి



బిజినేపల్లి: యాసంగిలో తక్కువ నీటి వసతి కలిగిన రైతులు నూనె గింజల పంటల సాగుపై దృష్టి పెట్టాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ సంచాలకుడు డాక్టర్ ఎం.వెంకటయ్య సూచించారు. వేరుశనగ పరిశోధన స్థానం జునాఘడ్ ఆధ్వర్యంలో బుధవారం పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం మార్కెట్‌లో నూనె గింజల పంటలకు అత్యధిక డిమాండ్ ఉందన్నారు. రైతులు యాసంగిలో వేరుశనగ పండించాలని సూచించారు. వేరుశనగలో అధిక దిగుబడులు పొందడానికి అవసరమైన సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు వాణిశ్రీ, రాంరెడ్డి, స్రవంతి, నళిని, దివ్యరాణి పాల్గొన్నారు.

భూసేకరణ ప్రక్రియ వేగవంతం



నాగర్‌కర్నూల్: సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ కె.సీతారామారావు సంబంధిత అధికారులను ఆదేశించారు. మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, మార్కండేయ ఎత్తిపోతల, అచ్చంపేట ఎత్తిపోతల పథకాలకు భూసేకరణపై బుధవారం కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ చాంబర్‌లో నీటిపారుదల, రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఎంజీకేఎల్‌ఐ పరిధిలోని కల్వకుర్తి, వెల్దండ, వంగూర్, చారగొండ, తాడూరు, తెలకపల్లి మండలాల్లో కొనసాగుతున్న 27, 28, 29, 30 ప్యాకేజీల్లో 143 ఎకరాల భూసేకరణ సర్వే పనులను వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు కావాల్సిన భూసేకరణకు రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. భూములు కోల్పోతున్న రైతులకు త్వరగా పరిహారం అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అరుణ, ఎస్‌ఈ సత్యనారాయణరెడ్డి, కేఎల్‌ఐ డీటీ నారాయణ తదితరులు ఉన్నారు.

గ్యారంటీలపై శ్వేతపత్రం విడుదల చేయాలి

నాగర్‌కర్నూల్ రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుపై శ్వేతపత్రం విడుదల చేయాలని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆయన స్వగృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కక్ష సాధింపులు, గూండాయిజం పెరిగిపోయిందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో పాలన చేసే సమయానికి కంటే ఎక్కువ దినాలు ఢిల్లీలోనే గడుపుతున్నారని విమర్శించారు. దేవుళ్ల సాక్షిగా హామీలు ఇచ్చి ఒక్కటి కూడా అమలు చేయడం లేదని ధ్వజమెత్తారు. రైతు రుణమాఫీ అమలులో చిత్తశుద్ధి లేదని.. ఫలితంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ అదుపు తప్పుతుందని విమర్శించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు బాలాగౌడ్, అర్థంరవి, లక్ష్మయ్య, సుభాష్ ఉన్నారు.



• ఇటు ఫార్మా.. అటు ఇథనాల్

కాలుష్య కోరల్లో పాలమూరు!

ఉమ్మడి జిల్లాకు పెను ముప్పుగా ఇథనాల్ కంపెనీల విస్తరణ



చిత్తనూర్ శివారులో ఏర్పాటైన ఇథనాల్ కంపెనీ

- ఇప్పటికే చిత్తనూర్ పరిసర ప్రాంతాలు కాలుష్యమయం
- 30 కి.మీ.ల మేర దుర్వాసన.. పంటలతో పాటు ప్రజారోగ్యంపై ప్రభావం
- వ్యతిరేకత పెల్లుబికుతున్నా హిందూపూర్‌లో వేగంగా సాగుతున్న పరిశ్రమ పనులు
- తాజాగా గద్వాల జిల్లా రాజోళి మండలంలో ఏర్పాటుకు సన్నాహాలు
- ప్రజా సంఘాల మండిపాటు.. స్థానికులతో కలిసి పోరుబాట



హిందూపూర్‌లో ఇథనాల్ కంపెనీ ఏర్పాట్లు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: జడ్చర్ల నియోజకవర్గం పోలేపల్లి సెజ్ పరిధిలో ఫార్మా పరిశ్రమలు వెదజల్లుతున్న కాలుష్యంతో పరిసర ప్రాంతాల ప్రజల జీవనం నిత్యనరకంగా మారింది. జడ్చర్ల మండలంలోని పోలేపల్లి, గుండ్లగడ్డ తండా, రాజాపూర్ మండలంలోని రాయపల్లి, ముదిరెడ్డిపల్లి గ్రామాల్లో భూగర్భజలాలు కలుషితం కాగా.. పంటల సాగుతో పాటు తాగడానికి కూడా పనికి రాకుండాపోయాయి. ఆయా గ్రామాల ప్రజలు చర్మ, ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులతో సతమతమవుతున్నారు. ఇది చాలదన్నట్లు ఉమ్మడి జిల్లాలో కాలుష్యకారక ఇథనాల్ పరిశ్రమల విస్తరణ కొనసాగుతుండడం ప్రజల్లో ఆందోళన రేపుతోంది. భవిష్యత్‌లో ఈ కంపెనీలు పెను ముప్పుగా మారే అవకాశం ఉండడం వారిని బెంబేలెత్తిస్తోంది.

చిత్తనూర్.. నిశ్శబ్ద ఉద్యమం..

నారాయణపేట జిల్లా మరికల్ మండలం చిత్తనూర్ గ్రామశివారులో 430 ఎకరాల్లో రూ.వెయ్యి కోట్ల అంచనాతో నిర్మాణమైన జూరాల ఆర్గానిక్ ఫారమ్స్, ఆగ్రో ఇండస్ట్రీస్ ఎల్‌ఎల్‌పీ (యూనిట్-1) ఇథనాల్ కంపెనీ ఆసియా ఖండంలోనే పెద్దది. చిత్తనూర్, జిన్నారం, ఎక్లాస్‌పూర్ గ్రామాల మధ్య ఈ కంపెనీ ఏర్పాటైంది. ఈ కంపెనీ ఏర్పాటు మూడు గ్రామాల్లో చిచ్చురేపగా.. పచ్చని పంట పొలాల్లో మంటలు పుట్టించింది. స్థానికులు తొలి నుంచి ఈ పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తున్నారు. దీన్ని శాశ్వతంగా రద్దు చేయాలనే డిమాండ్‌తో స్థానికులు సుమారు రెండేళ్లు ఉద్యమించారు. గతేడాది అక్టోబర్‌లో కంపెనీ నుంచి ఇథనాల్‌తో ఓ ట్యాంకర్ బయటకు రాగా.. స్థానికులు దాన్ని నిలిపివేయాలంటూ ఆందోళనకు దిగారు. ఒకరోజు మొత్తం సాగిన ఆందోళన ఉద్రిక్తతకు దారి తీసింది. ఆందోళనకారులు, పోలీసుల మధ్య ఘర్షణ చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో పోలీసులు ఆందోళనకారులపై కేసులతో ఉక్కుపాదం మోపగా.. సుమారు ఏడాదిగా నిశ్శబ్ద ఉద్యమం సాగుతోంది. పాలమూరు అధ్యయన వేదిక తదితర ప్రజాసంఘాలు వారికి మద్దతుగా గళమెత్తుతూ వస్తున్నాయి.

30 కి.మీ.ల మేర దుర్వాసన..

కంపెనీ ఏర్పాటును వ్యతిరేకిస్తున్న స్థానికులు ఆందోళన చేయకుండా ఒత్తిడి తీసుకురాగా.. ఆ మూడు గ్రామాల్లో నిశ్శబ్దం అలుముకుంది. ఈ క్రమంలో కంపెనీ పనులు పూర్తయ్యాయి. తొలుత కాలుష్యంతో కూడిన వ్యర్థజలాలను మన్నే వాగుల్లో వదలడంతో చేపలు మృత్యువాత పడ్డాయి. వాగులో స్నానాలు చేసిన పిల్లలకు శరీరంపై దద్దులు వచ్చాయి. గ్రామస్తులు ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. కంపెనీ నిర్వాహకులు మన్నేవాగులోకి కలుషిత నీరు వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు. అయితే కంపెనీ లోపల చెరువులా గుంతలు తవ్వి ఆ నీటిని అందులోకి వదులుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ ఇథనాల్ కంపెనీ వల్ల భవిష్యత్‌లో మరికల్, నర్వ, చిన్నచింతకుంట, ఆత్మకూర్, మక్తల్ మండలాల ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉన్నట్లు పర్యావరణ వేత్తలు అంచనా వేస్తున్నారు. ఈ కంపెనీ ప్రారంభమైన ఏడాదిలోపే చుట్టూ ఎటు చూసినా 30 కి.మీ.ల మేర దుర్వాసన వెదజల్లుతోంది. సుమారు 10 కిలోమీటర్ల వరకు పంటలపై ప్రభావం చూపుతున్నట్లు రైతులు చెబుతున్నారు.

కడుపులో మంట వస్తోంది..



మా గ్రామానికి ఇథనాల్ కంపెనీ 10 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఆరు నెలల నుంచి కంపెనీ నుంచి దుర్వాసనతో కూడిన గాలి వస్తోంది. నాతో పాటు గ్రామంలో చాలా మందికి కడుపులో మంటగా ఉంటోంది. దీంతో వైద్యుడిని సంప్రదిస్తే విష వాయువులను పీల్చడం వల్ల ఇలా జరుగుతుందని చెప్పారు. ఈ విషయంపై గ్రామస్తులు అందరం ఏకమై కంపెనీని రద్దు చేయాలని తహసీల్దార్‌ను కలిసి విన్నవించాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చాం. ఇంత వరకు ఫలితం రాలేదు. కంపెనీని ఎత్తివేసి మా ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఎంతైనా ఉంది.

– ఆంజనేయులు, ఫర్దీపూర్, చిన్నచింతకుంట

మా బతుకులు ప్రశ్నార్థకంగా మారుతాయి..



మా గ్రామం గుండా తుంగభద్ర నది పారుతోంది. పొలాలకు నీరు పెట్టుకునే అవకాశం ఉండటంతో పచ్చని పైర్లు పండుతాయి. ఇథనాల్ ఫ్యాక్టరీ పెడితే ఊర్లో ఉన్న పొలాలకు నీరు లేక, ఉన్న నీరు కలుషితమై వ్యవసాయంతో పాటు మా బతుకులు ప్రశ్నార్థకంగా మారుతాయి. ఇలాంటి ఫ్యాక్టరీలు ఉన్న చోట ప్రజలు పడే ఇబ్బందులు చూస్తూనే ఉన్నాం. అందుకే గ్రామంలో ఫ్యాక్టరీ నిర్మాణాన్ని అడ్డుకుంటున్నాం. ఎట్టి పరిస్థితుల్లో దాని నిర్మాణం జరగనివ్వం.

– రాజేంద్రప్రసాద్, రైతు, పెద్ద ధన్వాడ, రాజోళి

పునఃసమీక్షించాలి



ఇథనాల్ కంపెనీ వల్ల చాలా నష్టం. ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా ఫ్యాక్టరీ నిర్మాణం చేసుకోవడానికి అనుమతిస్తారా? పర్మిషన్లు ఇచ్చి ప్రజల్ని బందీలుగా చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇథనాల్ కంపెనీల విషయమై పునఃసమీక్షించాలి. పూర్తిగా రద్దు చేయాలి. లేకపోతే పోరాటం తప్పదు.

– బి.కృష్ణ, కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి, గుడెబల్లూర్

ఆ తర్వాత హిందూపూర్..

చిత్తనూరులో ఇథనాల్ కంపెనీ కార్యకలాపాలు మొదలు కాగా.. ఆ తర్వాత ఇదే నారాయణపేట జిల్లా కృష్ణా మండలంలోని హిందూపూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. ఈ కంపెనీ ఏర్పాటుపై ఇప్పటివరకు ప్రజాభిప్రాయ సేకరణ జరగలేదని స్థానికులు చెబుతుండగా.. మండల అధికారులు తమకేమీ తెలియదని సమాధానం ఇస్తున్నారు. కానీ కంపెనీ పనులు 50శాతం పూర్తయినట్లు తెలుస్తోంది.

తాజాగా పెద్ద ధన్వాడలో..

జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం రాజోళి మండలంలోని పెద్ద ధన్వాడ శివారులో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి గుట్టుచప్పుడు కాకుండా సన్నాహాలు మొదలయ్యాయి. దీనిపై స్థానికంగా వ్యతిరేకత పెల్లుబికింది. కేవీపీఎస్ వంటి ప్రజా సంఘాలతో పాటు రాజకీయ పక్షాలు స్పందించాయి. ఫ్యాక్టరీ నిర్మించొద్దని.. అనుమతులు రద్దు చేయాలంటూ సీపీఎం, బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు నిరసనల్లో పాల్గొన్నారు. చుట్టుపక్కల గ్రామస్తులతో కలిసి కలెక్టరేట్‌కి వెళ్లి వినతిపత్రం సైతం అందజేశారు. అధికార కాంగ్రెస్ నాయకులు ప్రెస్‌మీట్ పెట్టి ఫ్యాక్టరీ నిర్మాణాన్ని వ్యతిరేకించారు. కాగా..ఈ ఫ్యాక్టరీ ఏర్పాటైతే భవిష్యత్‌లో పెద్ద ధన్వాడ, చిన్న ధన్వాడ, ననసూర్, మాన్‌దొడ్డి, తుమ్మిళ్ల, పచర్ల, అయిజ మండలంలోని చిన్న తాండ్రపాడు, వెనుసోంపురం గ్రామాలపై ప్రభావం చూపే అవకాశం ఉన్నట్లు పర్యావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు.

బాల్యం.. చెరగని జ్ఞాపకం

బాల్యం.. మధురమైన జ్ఞాపకాలు, మరుపురాని సన్నివేశాలు సొంతం. ఎలాంటి కల్మషం లేకుండా ఆటపాటలతో గడిపిన కాలమది. ఆనందంగా, స్వేచ్ఛగా విహరించిన బాల్యం ఎన్నో మధురానుభూతులకు నిలయం. గురువారం చిల్డ్రన్స్‌డే సందర్భంగా జిల్లా ఉన్నతాధికారులు తమ బాల్యస్మృతులను 'సాక్షి'తో పంచుకున్నారు. – సాక్షి, నాగర్‌కర్నూల్

బాల్యానికి భరోసా అందరి బాధ్యత..



బాల్యం సాఫీగా, ఆనందంగా సాగేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. బాలకార్మికులకు పని నుంచి విముక్తి కల్పించాలి. ప్రతి ఒక్కరిని చదివించే విధంగా అందరూ కృషి చేయాలి. చిన్నారుల్లో విజ్ఞానం పెంచడం, సామాజిక స్పృహ, చైతన్యం కలిగించేందుకు అడుగులు పడాలి. అందుకు పాఠశాలనే సరైన ప్రదేశం. నాకు వీలు కుదిరినప్పుడల్లా చిన్నారులు, విద్యార్థులతో గడుపుతాను. వారితో మమేకం అవుతూ కొద్దిసేపు తిరిగి బాల్యంలోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తాను.

– బదావత్ సంతోష్, కలెక్టర్, నాగర్‌కర్నూల్

వ్యక్తిత్వానికి పునాది..





ప్రతి వ్యక్తి జీవితం మొత్తంలో బాల్యం బలమైన పునాది వేస్తుంది. ఈ దశలో విద్యార్థిగా వ్యక్తిత్వం, నడవడిక రూపుదిద్దుకుంటుంది. భవిష్యత్‌కు బాల్యంలోని అనుభవాలు, అనుభూతులే కీలకం. చిన్నారులందరికీ తమ బాల్యాన్ని ఆనందంగా, స్వేచ్ఛగా ఆస్వాదించే అవకాశం కల్పించాలి. నా చిన్నతనంలో చదువు కన్నా ఎక్కువగా స్నేహితులతో ఆటలు ఆడుకునేందుకే ఎక్కువ సమయం గడిపే వాడిని. బావులు, కాల్వల్లో ఈత కొట్టడం, ఆటల కోసం బహిరంగ ప్రదేశాల్లోనే ఎక్కువగా గడిపేవాళ్లం. ఇప్పుడు పోలీస్ అధికారిగా బాలల హక్కుల సంరక్షణలో పాలుపంచుకోవడం నాకు సంతృప్తినిస్తోంది.

– సీహెచ్ రామేశ్వర్, అడిషనల్ ఎస్పీ, నాగర్‌కర్నూల్

రైతుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

- ధాన్యం సేకరణలో వేగం పెంచాలి
- కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవంలో మంత్రి జూపల్లి కృష్ణారావు

పెంట్లవెల్లి/కొల్లాపూర్ రూరల్: రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పెంట్లవెల్లి మండలం కొండూరులో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం మద్దతు ధరకు కొంటుందని అన్నారు. సన్నరకం వడ్లకు రూ. 500 బోనస్ అందిస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పించడంతో పాటు ధాన్యం సేకరణ ప్రక్రియలో వేగం పెంచాలని అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బంది పెట్టినా, అవకతవకలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామన్నారు. త్వరలోనే అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని చెప్పారు. అనంతరం కొండూరు నుంచి సింగవరం, సంపత్‌రావుపల్లి గ్రామాలకు వెళ్లే రోడ్లపై ఉన్న వాగులను పరిశీలించారు. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు ఆయా వాగులపై వంతెనల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు మంత్రి జూపల్లి సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నల్లపోతుల గోపాల్, రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ ధర్మతేజ, రెడ్డిరవి, రామకృష్ణ, వెంకటస్వామి, కుర్మయ్య, శివ, ఏపీఎం గౌసొద్దీన్, ఎంపీడీఓ ప్రభాకర్, రాము పాల్గొన్నారు.

పర్యాటకులకు అన్ని వసతులు కల్పిస్తాం

సోమశిల క్షేత్రానికి వచ్చే పర్యాటకులకు అన్ని వసతులు కల్పిస్తామని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమశిలలో కృష్ణా పుష్కరఘాట్లను కలెక్టర్ బదావత్ సంతోష్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సోమశిలకు పర్యాటకులు, భక్తుల సంఖ్య పెరుగుతున్నందున వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా పర్యాటక శాఖ అధికారి నరసింహ్మను ఆదేశించారు. పుష్కరఘాట్ల వద్ద షవర్స్ ఏర్పాటుతో పాటు దుస్తులు మార్చుకునే గదులు, టాయిలెట్లు, అవసరమైన చోట సీసీ నిర్మించాలని తెలిపారు. వారి వెంట మాజీ సర్పంచ్ మద్దిలేటి ఉన్నారు.

చేపపిల్లల సైజ్ తక్కువగా ఉండటంపై ఆగ్రహం..

కృష్ణా బ్యాక్‌వాటర్‌లో వదిలే చేపపిల్లల సైజ్ తక్కువగా ఉండటంపై మంత్రి జూపల్లి ఆగ్రహం వ్యక్తంచేశారు. సోమశిల వద్ద కృష్ణా బ్యాక్‌వాటర్‌లో కలెక్టర్‌తో కలిసి చేపపిల్లలు వదిలేందుకు మంత్రి హాజరయ్యారు. అయితే చేపపిల్లల సైజ్ తక్కువగా ఉండటాన్ని గమనించిన మంత్రి.. కార్యక్రమాన్ని వాయిదా వేశారు. వందెకరాల ఆయకట్టు పైబడి ఉన్న కృష్ణానది, పెద్ద చెరువుల్లో వదిలే చేప పిల్లలు 80–100 మి.మీ. సైజు ఉండాలన్నారు. ప్రస్తుతం నదిలో వదిలేందుకు తెచ్చిన చేప పిల్లల సైజు 40 మి.మీ. మాత్రమే ఉండటంతో మత్స్యశాఖ ఏడీ రజనిపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రిజర్వాయర్లు, చెరువుల్లో చేపపిల్లలు వదిలే కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మత్స్యకార సంఘాలను భాగస్వామ్యం చేయాలని సూచించారు.

పారదర్శకంగా సమగ్ర కుటుంబ సర్వే

నాగర్‌కర్నూల్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సమగ్ర కుటుంబ సర్వే పారదర్శకంగా చేపడుతున్నట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. వరిధాన్యం, పత్తి కొనుగోలు, ఇంటింటి సర్వే, గ్రూప్-3 పరీక్షల ఏర్పాట్లపై బుధవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సమగ్ర కుటుంబ సర్వేలో ప్రజల నుంచి సేకరించిన వివరాలను ఆన్‌లైన్‌లో పక్కాగా నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సర్వే ప్రక్రియను సూపర్‌వైజర్లు, మండల ప్రత్యేకాధికారులు నిశితంగా పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ప్రణాళికా బద్ధంగా సర్వే చేపడుతున్నట్లు వివరించారు. ప్రజలు సర్వే సిబ్బందికి సహకరించి సమగ్ర సమాచారం ఇస్తున్నారన్నారు. క్షేత్రస్థాయిలో వరిధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించామని వివరించారు.

గ్రూప్-3 పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

జిల్లాలో గ్రూప్-3 పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి తన కార్యాలయం నుంచి కలెక్టర్, పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రూప్-3 పరీక్షల నిర్వహణపై పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 9,478 మంది అభ్యర్థులు గ్రూప్- 3 పరీక్షలు రాస్తున్నారని.. వీరి కోసం 33 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అందులో పీడబ్ల్యూడీ అభ్యర్థుల కోసం మూడు కేంద్రాలను కేటాయించినట్లు వివరించారు. పరీక్ష కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించడంతో పాటు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నట్లు వివరించారు. సమావేశంలో ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, అదనపు కలెక్టర్లు సీతారామారావు, దేవసహాయం, ఏఎస్పీ రామేశ్వర్, డీఈఓ గోవిందరాజులు ఉన్నారు.

ప్రజలు సహకరించాలి

కొల్లాపూర్: సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ కోరారు. కొల్లాపూర్ పట్టణంలో సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించారు. రోజు వారీగా సర్వే వివరాలను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసన్‌తో ఆరా తీశారు. ఎన్యూమరేటర్లు ప్రజల సందేహాలను నివృత్తి చేస్తూ.. సర్వే అంశాలను పూర్తిస్థాయిలో సేకరించాలని కలెక్టర్ సూచించారు.

నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను స్థాపించండి

నాగర్‌కర్నూల్ రూరల్: నాగర్‌కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గంలో రక్షణ, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయాలని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు ఎంపీ మల్లు రవి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఢిల్లీలో కేంద్ర మంత్రిని ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆర్మీ సెలక్షన్, ఎన్‌సీసీ ట్రెనింగ్ సెంటర్, ఆక్జిలరీ డిఫెన్స్ ప్రొడక్షన్ సెంటర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ కోసం నైపుణ్యాభివృద్ధి కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కేంద్రాల స్థాపనతో స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు యువతలో నైపుణ్యం పెంపొందించే అవకాశం లభిస్తుందన్నారు. ఈ విషయంపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ తెలిపారు.



ప్రాణాంతక వ్యాధుల నివారణకు టీకాలు తప్పనిసరి

నాగర్‌కర్నూల్ క్రైం: గర్భిణులు, చిన్నారులకు ప్రాణాంతక వ్యాధులు రాకుండా వందశాతం టీకాకరణ లక్ష్యాన్ని సాధించాలని డీఎంహెచ్‌ఓ డా.స్వరాజ్యలక్ష్మి అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా వైద్యారోగ్యశాఖ, ప్రపంచ ఆరోగ్య సంస్థ సంయుక్తంగా జిల్లాలోని వైద్యాధికారులు, పర్యవేక్షణ సిబ్బందికి టీకాకరణపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. గర్భిణిగా నమోదు చేసుకున్న వెంటనే ధనుర్వాత టీకాతో పాటు పుట్టిన చిన్నారి నుంచి 16 ఏళ్ల వరకు 12 ప్రాణాంతక వ్యాధుల నివారణకు క్రమం తప్పకుండా వ్యాధి నివారణ టీకాలు వేయాలని సూచించారు. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల్లోని వార్డుల్లో ప్రణాళికా బద్ధంగా చిన్నారులకు టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు టీకాకరణ కార్యక్రమంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా.రవికుమార్ మాట్లాడుతూ.. వ్యాక్సిన్లను భద్రపరచడం, కోల్డ్‌చైన్ నిర్వహణ, జాతీయ ఇమ్యునైజేషన్ షెడ్యూల్, టీకాకరణ తదితర అంశాలను వివరించారు. అనుమానిత పోలియో, తట్టు, రూబెల్లా, కోరింత దగ్గు, కంఠసర్పి, ధనుర్వాతం తదితర వ్యాధులపై ప్రత్యేక నిఘా ఉంచాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధి డా. అజహర్ సూచించారు. 15 ఏళ్ల చిన్నారుల్లో అనుమానిత లక్షణాలు కనిపిస్తే వెంటనే జిల్లా టీకాకరణ అధికారికి తెలియజేయాలని తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా.వెంకటదాస్, డా.తారాసింగ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డా.స్వరాజ్యలక్ష్మి

పరీక్ష ఫీజు చెల్లించాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరం విద్యార్థులతో పాటు ఫెయిల్ అయిన అన్ని గ్రూపుల సాధారణ విద్యార్థులు, వృత్తివిద్య కోర్సుల విద్యార్థులు ఈ నెల 26వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించాలని డీఐఈఓ జి.వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా విద్యార్థులు సకాలంలో ఫీజు చెల్లించాలని సూచించారు. డిసెంబర్ 4వ తేదీ వరకు రూ. 100 అపరాధ రుసుము, డిసెంబర్ 11 వరకు రూ. 500, 18వ తేదీ వరకు రూ. 2వేల అపరాధ రుసుముతో ఫీజు చెల్లించే అవకాశం కల్పించినట్లు తెలిపారు.

క్లుప్తంగా

కాల్వలో పడి వ్యక్తి మృతి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మురుగుకాల్వలో పడి గుర్తుతెలియని వ్యకి మృతిచెందాడు. ఈ ఘటన బుధవారం జిల్లాకేంద్రంలోని బ్రహ్మణ్‌వాడీలో చోటు చేసుకుంది. అదే ప్రాంతానికి చెందిన అక్బర్ మురుగుకాల్వలో వ్యక్తి పడి మృతిచెంది ఉండటాన్ని గమనించారు. వన్‌టౌన్ పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు.

రైలు పట్టాలపై మృతదేహం లభ్యం

జడ్చర్ల: జడ్చర్ల-గొల్లపల్లి రైల్వేస్టేషన్ల మధ్య రైలుపట్టాలపై బుధవారం గుర్తుతెలియని యువకుడి(38) మృతదేహం లభ్యమయినట్లు రైల్వే ఎస్ఐ సయ్యద్ అక్బర్ తెలిపారు. మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మోసం చేసిన సైబర్ నేరస్తుడు

నాగర్‌కర్నూల్ క్రైం: అమెజాన్‌లో జాబ్ ఇస్తామని చెప్పడంతో ఓ వ్యక్తి సైబర్ నేరస్తుడికి డబ్బులు ఇచ్చి మోసపోయిన సంఘటన బుధవారం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. నాగర్‌కర్నూల్ ఎస్ఐ గోవర్ధన్ వివరాల ప్రకారం.. ముస్సిపాల్టీ పరిధిలోని ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన అనీఫ్ గతంలో అమెజాన్ కంపెనీలో పనిచేసి ఉద్యోగం మానేశాడు. ఇటీవల టెలిగ్రామ్‌లో అమెజాన్ కంపెనీలో ఉద్యోగాలు ఉన్నట్లు సైబర్ నేరస్తుడు ప్రకటన పెట్టడంతో అనీఫ్ సైబర్ నేరస్తుడిని సంప్రదించి విడతల వారీగా రూ.1.72లక్షలు సైబర్ నేరస్తుడికి ఇచ్చాడు. సైబర్ నేరస్తుడిని ఫోన్‌లో సంప్రదించడంతో ఎలాంటి స్పందన లేకపోవడంతో మోసపోయినట్లు గ్రహించి బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తాగుడుకు బానిసై..

● భార్యను హత్యచేసిన భర్త


హత్యకు గురైన లక్ష్మి

నవాబుపేట: మల్లేష్ తాగుడుకు బానిసయ్యాడు. మద్యం మత్తులో భార్యను కర్రతో కొట్టి హత్యచేశాడు. ఈఘటన బుధవారం నవాబుపేటలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మద్దూర్ మండలం జాజర్‌పల్లికి చెందిన ఎరుకలి లక్ష్మి అలియాస్ రేణుకా(30)కు 15సంవత్సరాల క్రితం నవాబుపేటకు చెందిన మల్లేష్‌తో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. మొదట్లో బాగానే ఉన్నా కొన్నేళ్ల నుంచి మల్లేష్ తాగుడుకు బానిసయ్యాడు. కుటుంబ పోషణను గాలికొదిలేశాడు. లక్ష్మి కూలి పనులు చేస్తూ పిల్లలను పోషించేది. మంగళవారం రాత్రి తాగొచ్చి భార్యను కర్రతో విచక్షణారహితంగా కొట్టాడు. ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. బాత్‌రూంలో జారిపడి మరణించిందని లక్ష్మి పుట్టింటివారికి సమాచారమిచ్చాడు. వారు ఇక్కడికి చేరుకొని విచారణ చేపట్టగా అసలు నిజం బయటపడింది. దీంతో మృతురాలి సోదరుడు నగేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు.

భారత్‌మాల రోడ్డుపై దొరికిన జింక



అయిజ: మండలంలోని అయిజ శివారులో భారత్‌మాల రోడ్డుపై బుధవారం రాత్రి రైతు శ్రీనుకు గాయపడిన జింక పిల్ల కనపడింది. నడవలేని స్థితిలో ఉండడంతో శ్రీను స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించాడు. ఎస్సై విజయ భాస్కర్ ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందజేశారు. ముందుగా వెటర్నరీ సహాయ వైద్యుడు జింకకు ప్రథమ చికిత్స చేశారు. అనంతరం పోలీసులు ఫారెస్ట్ అధికారులకు జింకను అప్పగించారు.

జూరాలకు స్వల్ప ఇన్‌ఫ్లో

ధరూరు : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోలు స్వల్పంగా కొనసాగుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. నెట్టెంపాడు ఎత్తిపోతలలో ఒక పంపులో నీటిపంపింగ్ కొనసాగుతోంది. బుధవారం సాయంత్రం వరకు ప్రాజెక్టుకు 3వేల 445 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 9.657టీఎంసీలు. ప్రస్తుతం ప్రాజెక్టులో 9.214 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

రామన్‌పాడు నీటిమట్టం1020అడుగులు

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో బుధవారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,020 అడుగులకు చేరింది. జూరాల, ఎడమ, సమాంతర కాలువల ద్వారా 1030 క్యూసెక్కులు, 1000 సెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఎన్టీఆర్ కాలువ ద్వారా 1,050 క్యూసెక్కులు కుడి, ఎడమ కాలువ ద్వారా 25క్యూసెక్కులు వివిధ లిఫ్ట్‌ల ద్వారా 851 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ వరప్రసాద్ తెలిపారు.

'బాణం' గురి తప్పదు

వ్యక్తిగత క్రీడాంశాల్లో అతి క్లిష్టమైన క్రీడనే ఇష్టంగా మార్చుకొని ఆచిన్నారులు రాణిస్తున్నారు. వారు గురిపెడితే బాణం దిగాల్సిందే.. అంతటి ప్రతిభ చూపి సత్తా చాటుతున్నారు. ఆర్చరీలో చిచ్చురు పిడుగులు చూపిస్తున్న ప్రదర్శనను చూసి పలువురు నివ్వెరపోతున్నారు. వారు చేస్తున్న విన్యాసాలను ఎందరినో ఆకట్టుకుంటున్నాయి.. బాలల దినోత్సవం సందర్భంగా ఆర్చరీలో రాణిస్తున్న చిన్నారులు శ్రీహిత, సాయిసిద్దిక్షపై 'సాక్షి' ప్రత్యేక కథనం..


← శ్రీహిత

ఆర్చరీ చిచ్చర పిడుగులు శ్రీహిత, సాయిసిద్దిక్ష

- కోచ్ జ్ఞానేశ్వర వద్ద ప్రత్యేక శిక్షణ
- ఆకట్టుకుంటున్న విన్యాసాలు
- రాష్ట్రస్థాయిల్లో పలు పతకాలు

మహబూబ్‌నగర్ క్రీడలు: ఆచిన్నారులు బాణం గురి పెడితే..లక్ష్యానికి చేరాల్సిందే. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన రాత్లావత్ శ్రీహిత, సాయిసిద్దిక్ష ఆర్చరీ క్రీడలో విశేషంగా రాణిస్తున్నారు. స్థానిక మెయిన్ స్టేడియంలో కోచ్ జ్ఞానేశ్వర్ వద్ద వారు ఆర్చరీలో ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారు. ఎంతో క్లిష్టమైన ఆర్చరీ క్రీడను తమకు ఇష్టమైన ఆటగామార్చుకొని సత్తాచాటుతున్నారు. జిల్లా, రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో పతకాలు సాధిస్తూ అందరి మన్ననలు పొందుతు న్నారు. పలు ఛానెళ్లలో ఈ ఇద్దరు చిన్నారులు ఆర్చరీ విన్యాసాలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఓ హిందీ చానెల్, ఓ తెలుగు టీవీలో ఆర్చరీ ప్రదర్శనలు ఇచ్చారు. కేరళ రాష్ట్రంలోని ఓ టీవీ చానెల్ నిర్వహించిన కిడ్స్ క్లబ్ కార్యక్రమంలో ఈ చిన్నారులు పాల్గొని ప్రతిభచాటి గోల్డెన్ బజర్ రౌండ్‌లో రూ.లక్ష నగదు బహుమతిని అందుకున్నారు.ఇండియన్ కంపౌండ్‌బౌలో 30మీటర్ల లక్ష్యాన్ని ఛేదించేలా ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారు చిన్నారులు.



ఐదేళ్ల వయస్సు నుంచి శిక్షణ..

హన్వాడ మండలం రాంనాయక్‌తండాకు చెందిన 8 ఏళ్ల శ్రీహిత ఆర్చరీలో విశేషంగా రాణిస్తోంది. ఐదేళ్ల వయస్సు నుంచే ఆర్చరీలో శిక్షణ తీసుకుంటోంది. మూడేళ్లుగా ఈ చిన్నారి ఇండియన్ కంపౌండ్‌బౌలో శిక్షణ తీసుకుంటూ ప్రతిభ చాటుతోంది. 2022లో కరీంనగర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీల్లో, 2023లో హైదరాబాద్‌లో జరిగిన ఎస్ఎఫ్ఏ టోర్నీలో అండర్-10 విభాగంలో బంగారు పతకం సాధించింది. ఈ ఏడాది సెప్టంబర్‌లో కూడా ఎస్ఎఫ్ఏ టోర్నీలో అండర్-10 విభాగంలో బంగారు పతకం అందుకుంది. 2023 జనవరిలో విజయవాడలో నిర్వహించిన జాతీయస్థాయి టోర్నీలో ఏడోస్థానం దక్కించుకుంది.


← ఆర్చరీ ప్రాక్టీస్ చేస్తున్న సాయిసిద్దిక్ష

ఆర్చరీలో సాయిసిద్దిక్ష ప్రతిభ

మహబూబ్‌నగర్‌కి చెందిన ఆరేళ్ల సాయిసిద్దిక్ష మూడేళ్ల వయస్సు నుంచి ఆర్చరీలో శిక్షణ తీసుకుంటోంది. 2022లో కరీంనగర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీల్లో కాంస్యం, పతకం సాధించింది. 2023లో హైదరాబాద్‌లో జరిగిన ఎస్ఎఫ్ఏ టోర్నీలో అండర్-10 విభాగంలో కాంస్యం, ఈ ఏడాది సెప్టంబర్‌లో కూడా ఎస్ఎఫ్ఏ టోర్నీలో అండర్-10 విభాగంలో కాంస్య పతకం అందుకుంది. 2023 జనవరిలో విజయవాడలో నిర్వహించిన జాతీయస్థాయి టోర్నీలో పాల్గొంది.

కూచిపూడి నేర్చుకునేందుకు ప్రోత్సహించాం

● ఎస్పీ రావుల గిరిధర్, అపర్ణ దంపతులు

వనపర్తి: తల్లిదండ్రులు తమ పిల్లలను ఇష్టాన్ని బట్టి వారిని ప్రోత్సహించాలని ఎస్పీ రావుల గిరిధర్, అపర్ణ దంపతులు అన్నారు. తమ కూతురు సిద్ది ప్రస్తుతం జెఎన్‌టీయూలో ఇంజనీరింగ్ చదువుతోంది. తాను రెండో తరగతి చదువుతున్నప్పుడే కూచిపూడి నృత్యంపై ఆసక్తి చూపింది. కూచిపూడిని నేర్చుకునేందుకు ప్రోత్సహించాం. హైదరాబాద్‌లోని ప్రముఖ కూచిపూడి నృత్యగురువు శైలజ వద్ద శిక్షణ ఇప్పించాం. తాను తొమ్మిదవ తరగతి చదివే వరకు బాగా నేర్చుకోవటంతోపాటు శిల్పారామం, రవీంద్రభారతి, తిరుపతి, వైజాగ్ ప్రాంతాల్లో నృత్య ప్రదర్శనలిచ్చి బహుమతులు సాధించింది. ప్రస్తుతం చదువుపై శ్రద్ధ ఎక్కువ చూపుతున్నా.. కూచిపూడి నృత్యాన్ని మాత్రం మరువలేదు.


కూతురు సిద్దితో ఎస్పీ రావుల గిరిధర్, అపర్ణ దంపతులు

నాట్య 'వేద'ం



- కాళ్లకు గజ్జ కడితే నాట్యమయూరే
- కూచిపూడిలో ప్రతిభ చూపుతున్న వేద
- పలు ఆలయాల్లో నృత్య ప్రదర్శనలు

తెలుగు వారి వేదం నవరస నాట్య వినోదం.. మూడేళ్ల వయసులో నాట్యం.. తొమ్మిదేళ్ల వయసులో రికార్డు చిన్నారి వేద. తన అసమాన ప్రతిభతో చిన్నిపాదాలను కదిలించి అత్యున్నత శిఖరాన్ని అధిరోహించింది. నటరాజ డాన్స్ అకాడమీ ద్వారా అక్కడి బృందాలతో కలిసి రికార్డులకెక్కింది.. అతి చిన్న వయసులో అద్భుతమైన నాట్యంతో అబ్బురబరుస్తున్న ఈ చిన్నారి వివరాల్లోకి వెళ్తే...

– మెట్టుగడ్డ

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి చెందిన తొమ్మిదేళ్ల వేద కూచిపూడిలో రాణిస్తోంది. తల్లిదండ్రులు రజినీకాంత్‌రెడ్డి, అరుంధతి ప్రోత్సాహంతో ఆ చిన్నారి అందరిని ఆకర్షించేలా ప్రదర్శనలు ఇస్తుంది. ఇప్పటికే కిమీస్వార్డ్ రికార్డుల సైతం వేద చోటు సంపాదించింది. ఓ ప్రైవేట్ పాఠశాలలో 5వ తరగతి చదువుతోంది. వేద చిన్నప్పటి నుంచే కళల పట్ల ఆకర్షితురాలైంది. ఈవిషయాన్ని గమనించిన తల్లిదండ్రులు కూచిపూడిలో శిక్షణ ఇప్పించారు. జిల్లా కేంద్రంలోని నటరాజ డాన్స్ అకాడమీ వారిని సంప్రదించి అందులో చేర్పించారు. డాన్స్ టీచర్ అనూష చిన్నారి వేద పట్టుదలను గమనించి కూచిపూడిలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. కేవలం మూడేళ్లలోనే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా తన ప్రతిభను చాటింది. గత సంవత్సరం గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన గిన్నిస్ వరల్డ్ నాట్య ప్రదర్శనలో తన ప్రతిభను చాటి గిన్నిస్ రికార్డులో చోటు దక్కించుకుంది. అంతకుముందు చిన్నజీయర్ స్వామి ఆశ్రమంలో 12మందితో కళాప్రదర్శన ఇచ్చింది. జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్‌లోనూ యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రంలోనూ జరిగిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొని కూచిపూడి ప్రదర్శనను ఇచ్చింది. చిన్నారి వేద కాళ్లకు గజ్జకట్టి నాట్యం చేస్తుంటే చూసే వారందరూ నాట్య మయూరే దిగొచ్చిందా అనే స్థాయిలో తన ప్రదర్శన ఉంటుంది.

మొదట్లోనే పాప వేదకు...

తల్లిదండ్రుల ఆసక్తితో తన వద్దకు వచ్చిన మొదట్లోనే పాప వేదకు నాట్యంపై ఉన్న ఆసక్తిని గమనించి శిక్షణ ఇచ్చా. చిన్నారి వేద ఆసక్తిని చూసి ఎప్పటికైనా మంచి నృత్యకారిణిగా గుర్తింపు తెచ్చుకుంటుందన్న ఆశాభావం ఉండేది.

– అనూష, డాన్స్ టీచర్

కూచిపూడిలో శిక్షణ ఇప్పించాం

చిన్నప్పటి నుంచి తమ పాపకు నాట్యంపై ఉన్న ఆసక్తిని గమనించాం. కూచిపూడిలో ప్రత్యేక శిక్షణ ఇప్పించాం. నాట్యంలో అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న వేదని చూస్తుంటే చాలా గర్వంగా అనిపిస్తుంది.

– రజినీకాంత్‌రెడ్డి, అరుంధతి, వేద తల్లిదండ్రులు


చిన్నారి వేదతో తల్లిదండ్రులు

జోనల్ క్రీడల్లో విద్యార్థుల సత్తా

- మూడో రోజు అదేజోరు
- పలు విభాగాల్లో ప్రతిభ

లింగాల: స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ బాలుర గురుకుల పాఠశాల, కళాశాల ఆవరణలో 10వ జోనల్ క్రీడల్లో పలు గురుకులాల విద్యార్థులు సత్తా చాటుతున్నారు. బుధవారం మూడోరోజు క్రీడలు జోరుగా సాగాయి. పలు విభాగాల్లో జరిగిన క్రీడల్లో విద్యార్థులు గెలుపే లక్ష్యంగా పోటీపడ్డారు. అండర్-14 వంద మీటర్ల పరుగులో మొదటి స్థానంలో విశాల్(మదనాపూర్), రెండో స్థానంలో రాంచరణ్(జేపీనగర్), మూడో స్థానంలో శ్రీరాంనాయక్(లింగాల) ఉన్నారు. అండర్-17 విభాగంలో వరుసగా మల్లేష్‌నాయక్(జేపీనగర్), ఎం.అరుణ్(ఐజ), శివకుమార్(మదనాపూర్). 400 మీటర్ల రిలే అండర్-17లో జేపీనగర్, మదనాపూర్, అచ్చంపేట, ఇదే విభాగంలో అండర్-19లో లింగాల, జేపీనగర్, గద్వాల జట్లు గెలుపొందాయి. బాల్‌బ్యాడ్మింటన్ అండర్-17 విభాగంలో మొదటి స్థానంలో ఇటిక్యాల, రెండో స్థానంలో లింగాల, ఇదే విభాగం అండర్-19లో ఇటిక్యాల, లింగాల విద్యార్థులు విజయం సాధించారు. హైజంప్ అండర్-14లో వరుసగా హెచ్.వినయ్‌కుమార్(అచ్చంపేట), ఎం.ప్రవీణ్(అచ్చంపేట), రాంచరణ్(జేపీనగర్), ఇదే విభాగం అండర్-17లో దిల్‌శాన్(జేపీనగర్), జి.కిరణ్‌కుమార్(బాలానగర్), పి.గణేష్(లింగాల), అండర్-19లో ఉదయ్‌కిరణ్(లింగాల), జి.చరణ్(దేవరకద్ర), కె.దినేష్(గద్వాల), అండర్-19 ఫుట్ బాల్‌లో మొదటి స్థానంలో వీపనగండ్ల, రెండో స్థానంలో బాలానగర్ జట్లు విజయం సాధించినట్లు ప్రిన్స్‌పాల్ బాలస్వామి, పీడీ వెంకటేశ్వర్లు తెలిపారు.


అండర్-14 ఖోఖోలో తలపడుతున్న లింగాల, దామరగిద్ద విద్యార్థులు


అండర్-19 కబడ్డీలో తలపడుతున్న జేపీనగర్, గద్వాల విద్యార్థులు

జితేందర్‌రెడ్డి పాత్రలో నటించటం అదృష్టం

● హీరో రాకేష్‌వర్రె


మాట్లాడుతున్న సినీ హీరో రాకేష్‌వర్రె

జడ్చర్ల టౌన్: ధర్మం, జాతీయవాదం కోసం పోరాడిన వ్యక్తి జితేందర్‌రెడ్డి అని, ఆయన పాత్రలో నటించటం అదృష్టమని హీరో రాకేష్‌వర్రె అన్నారు. బుధవారం శ్రీనివాస థియేటర్‌లో ప్రదర్శింపబడిన జితేందర్‌రెడ్డి సినిమా మార్నింగ్‌షోను ప్రేక్షకులతో కలిసి ఆయన చూశారు. ఈ సందర్భంగా రాకేష్ మాట్లాడుతూ జితేందర్‌రెడ్డి చరిత్ర పదిమందికి తెలిసేలా సినిమాను అందరూ చూడాలని ఆయన పిలుపునిచ్చారు. సినిమాకు జడ్చర్లలో మంచి ఆదరణ లభించిందన్నారు. నిర్మాత ముదుగంటి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ జితేందర్‌రెడ్డి చరిత్ర మరుగునపడకుండా ఉండేందుకు సినిమా నిర్మించామన్నారు. దర్శకుడు విరించి వర్మ మాట్లాడుతూ బయోపిక్ తీయాలంటే చరిత్రను అవగాహన చేసుకోవాల్సి ఉందని, అందుకు అందరూ సహకరించారన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు శ్రీనాథ్, బీజేపీ, బీజేవైఎం నాయకులతోపాటు థియేటర్ మేనేజర్ నవీన్ ఉన్నారు. ఈ సందర్భంగా హీరో రాకేష్ ఏబీవీపీ జెండా పట్టుకుని థియేటర్‌లో ప్రేక్షకుల మధ్య కొద్దిసేపు తిరిగి ఉత్సాహపరిచారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

గద్వాల క్రైం: తాళం వేసిన ఇంట్లోకి చొరబడి మూడు తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వేదనగర్ కాలనీకి చెందిన కృష్ణమ్మ కుటుంబ సభ్యులతో కలసి హైదరాబాద్‌లోని బంధువుల ఇంటికి వెళ్లింది. నేటి ఉదయం ఇంటికి వచ్చి చూడగా తాళం ధ్వంసం చేసి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువలోని మూడు తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అదే విధంగా నల్లకుంట, బుర్దపేట కాలనీలోని మూడు ఇళ్లలో దొంగలు చోరీకి యత్నించారు. దొంగతనాలపై పోలీసులు విచారణ చేపట్టారు.

జోరుగా.. హుషారుగా


పరుగు పందెంలో పాల్గొన్న క్రీడాకారిణులు

- 3వ రోజు కొనసాగిన 10వ జోనల్ స్థాయి క్రీడలు
- నేడు క్రీడల ముగింపు ఉత్సవం


చదరంగం ఆడుతున్న మక్తల్-ఆర్ఆర్ గూడెం బాలికలు

జడ్చర్ల: మండల పరిధిలోని చిట్టెంబోయిన్‌పల్లి సమీపంలో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో 10వ జోనల్ స్థాయి క్రీడా పోటీలు బుధవారం హుషారుగా కొనసాగాయి. మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల పరిధిలోని ఎనిమిది సోషల్ వెల్ఫేర్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు చెందిన 680 మంది బాలికలు క్రీడల్లో పాల్గొన్నారు. అండర్-14, అండర్-17, అండర్-19 విభాగాలకు సంబంధించి అథ్లెటిక్స్, లాంగ్‌జంప్, హైజంప్, టెన్నికాయిట్, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, కబడ్డీ, చెస్, క్యారమ్స్ పోటీల్లో బాలికలు పాల్గొన్నారు. గురువారంతో పోటీలు ముగియనున్నాయి.

విజేతలు వీరే

అథ్లెటిక్స్‌కు సంబంధించి లాంగ్ జంప్ అండర్-19లో ప్రథమ స్థానం లావణ్య(నస్‌చర్ల), ద్వితీయ స్థానం సంధ్యా రాణి(జడ్చర్ల), 1500 మీటర్ల పరుగు పందెంలో అండర్-17లో ప్రథమ స్థానం దీనవతి (ఊట్కూర్), ద్వితీయ స్థానం మహిమత కుమారి(జడ్చర్ల), తృతీయ స్థానం జయశ్రీ(జడ్చర్ల) సాధించారు. అదే విధంగా ఖోఖోలో అండర్-17 విభాగానికి సంబంధించి ఊట్కూర్ జట్టు విన్నర్‌గా, మరికల్ జట్టు రన్నర్‌గా నిలిచింది. టెన్నికాయిట్‌లో అండర్-14 విభాగంలో ఊట్కూర్ జట్టు విన్నర్‌గా, మద్దూరు జట్టు రన్నర్‌గా నిలిచింది. విజేతలకు ప్రిన్సిపాల్ అనిత, జిల్లా కోఆర్డినేటర్ వాణిశ్రీ ప్రశంసా పత్రాలు అందజేశారు.

పరుగుల 'కీర్తన'

రన్నింగ్‌లో మూడు విభాగాల్లో ప్రథమస్థానం

గోపాల్‌పేట: కీర్తన పరుగు పెట్టిందంటే ప్రథమ స్థానం దక్కాల్సిందే. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా మూడు విభాగాల్లో ప్రథమ స్థానాన్ని దక్కించుకొని అందరి దృష్టిని ఆకర్షించింది. మండలంలోని బుద్దారం గురుకుల పాఠశాలలో సోమవారం ప్రారంభమైన జోనల్ ఆటల పోటీలు బుధవారం మూడోరోజు కొనసాగాయి. వెల్దండకు చెందిన గురుకుల పాఠశాల విద్యార్థిని కీర్తన రన్నింగ్‌లో అదరగొట్టింది. అండర్-19 3కే రన్, 400మీటర్లు, 200 మీటర్లు, 100మీటర్ల రన్నింగ్‌లో ప్రథమస్థానంలో నిలిచింది. అండర్-14 ఖోఖోలో ప్రథమస్థానంలో మన్ననూరు నిలువగా మానవపాడు రెండో స్థానంలో నిలిచింది. అండర్-19 ఖోఖోలో వంగూరు మొదటి, తెల్కపల్లి రెండో స్థానాలను దక్కించుకున్నాయి. కబడ్డీ అండర్-14లో కొల్లాపూర్ ప్రథమస్థానంలో నిలువగా అలంపూర్ రెండో స్థానంలో నిలిచింది. అండర్-17 హ్యాండ్‌బాల్‌లో గోపాల్‌పేట మొదటి, నిలువగా అలంపూర్ ద్వితీయస్థానాన్ని దక్కించుకున్నాయి. బాల్ బ్యాడ్మింటన్ అండర్-17లో గోపాల్‌పేట ప్రథమస్థానంలో నిలువగా ద్వితీయస్థానంలో మన్ననూరు నిలిచింది. టెన్నికోట్ అండర్19లో వంగూరు ప్రథమస్థానంలో నిలువగా పెద్దమందడి ద్వితీయస్థానంలో నిలిచింది. క్రీడాపోటీలను జోనల్ ఇంచార్జి భాస్కర్‌గౌడ్, ప్రిన్సిపాల్ ఆరోగ్య పర్యవేక్షించారు.


అండర్-17 వాలీబాల్‌లో తలపడుతున్న తెల్కపల్లి, గోపాల్‌పేట జట్లు

బ్యాడ్మింటన్ రాష్ట్ర జట్టుకు మేనేజర్‌గా రవికుమార్



మహబూబ్‌నగర్ క్రీడలు: భువనేశ్వర్‌లో ఈనెల 19 నుంచి 25వ తేదీ వరకు జరిగే జూనియర్ నేషనల్ బ్యాడ్మింటన్ (అండర్19) చాంపియన్‌షిప్‌లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు మహబూబ్‌నగర్‌కు చెందిన ఎల్.రవికుమార్ మేనేజర్‌గా నియమితులయ్యారు. ఈమేరకు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ వారు ఉత్తర్వులు జారీచేశారు. రవికుమార్ మహబూబ్‌నగర్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్‌కు ప్రధాన కార్యదర్శిగా, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణకు సంయుక్త కార్యదర్శిగా ఉన్నారు. ఆయన ఎంపికపై మహబూబ్‌నగర్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.శ్యాంసుందర్‌గౌడ్, ఉపాధ్యక్షులు ప్రవీణ్‌కుమార్, గుద్దేటి శివప్రసాద్, కార్యనిర్వాహక కార్యదర్శి సాదత్‌ఖాన్, విజయ్‌రెడ్డి హర్షం వ్యక్తంచేశారు.

క్లుప్తంగా

మైక్‌సెట్ వితరణ



అచ్చంపేట: శ్రీశైలం ఉత్తరద్వారమైన ఉమామహేశ్వర ఆలయానికి అచ్చంపేటకు చెందిన కౌసల్య ఎలక్ట్రానిక్స్ యాజమాని పులిజాల శ్రీనివాసులు బుధవారం రూ.25వేల విలువైన మైక్‌సెట్‌ను ఆలయ చైర్మన్ బీరం మాధవరెడ్డికి అందజేశారు. ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలని చైర్మన్ కోరారు.

నోడల్ అధికారి ఆకస్మిక తనిఖీ



తాడూరు: మండల కేంద్రంలోని కూచుకుళ్ల సౌభాగ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం జిల్లా నోడల్ అధికారి వెంకటరమణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కళాశాలలో రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల పరీక్షల ఫీజు సకాలంలో చెల్లించాలన్నారు. సకాలంలో సిలబస్ పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలన్నారు. ఆయన వెంట సిబ్బంది, తదితరులు ఉన్నారు.

మాల, మాదిగలను విడదీసేందుకు కుట్ర



తాడూరు: మాల, మాదిగలను విడదీసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పన్నాయని మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జెట్టి వెంకటేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మాల మహానాడు ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో హైదరాబాద్‌లో మాలల సింహగర్జన పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. మాలలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు తిరుపతయ్య, శ్రీను, చంద్రయ్య, కురుమయ్య, హుస్సేన్, వెంకటయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తులసి పూజలు



లింగాల: మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో బుధవారం ఆకు పూజలు నిర్వహించారు. కార్తీక మాసం పురస్కరించుకొని ఇళ్లలో తులసి చెట్టుకు పూజలు చేసి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భజన మండలి సభ్యులు భక్తిగీతాలను ఆలపించారు.

సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన

తెలకపల్లి: మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్ ఆవరణలో బుధవారం వ్యాపార, వర్తక దుకాణాల యాజమానులతో ఎస్‌ఐ నరేష్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎలాంటి చోరీలు, నేరాలు జరుగకుండా నిరోధించేందుకు అందరు సహకరించాలన్నారు. మండల కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు సహకరించాలని కోరారు. సమావేశంలో 30 మంది వ్యాపార, వర్తకదుకాణాల యజమానులు పాల్గొన్నారు.

మహారాష్ట్రలో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం



తిమ్మాజిపేట: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆలేగావ్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న వసంత్‌చింద్‌జీ మద్దతుగా బుధవారం నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఆయన వెంట సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, బహదూర్‌లు ఉన్నారు.

ప్రతి గింజను కొంటాం



బిజినేపల్లి లట్టుపల్లి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి

బిజినేపల్లి: ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని లట్టుపల్లిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దళారీ వ్యవస్థను పూర్తిగా రూపుమాపుదామన్నారు. సన్న వడ్లకు ప్రభుత్వం రూ. 500 బోనస్‌గా ఇస్తుందన్నారు. సకాలంలో రైతుల ఖాతాలో నగదు జమ చేయాలన్నారు. పీఏసీఎస్ చైర్మన్ బాలరాజ్‌గౌడ్, మాజీ చైర్మన్ వెంకటస్వామి, అమృత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్‌రూరల్: మండలంలోని గగ్గలపల్లిలో ఐకేపీ వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఐకేపీ ఏపీఎం శ్రీనివాసులు గ్రామ మహిళా సంఘం సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలోనే ధాన్యాన్ని విక్రయించాలన్నారు. మొదటి గ్రేడ్‌కు రూ.2320 లు, బీ గ్రేడ్‌కు రూ.2300లు ప్రభుత్వం మద్దతు ధర ఇస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామ మహిళా సంఘం అధ్యక్షురాలు గీత, కాంగ్రెస్ నాయకులు కొండ నాగేష్, మండల కోఆప్షన్ నంబర్ అబ్దుల్‌జబ్బార్, సీసీ రాములు, వీఓఏ రామస్వామి, పంచాయతీ కార్యదర్శి శశికళ, కొండ గణేష్, చిన్నరాయుడు, ఊశన్న, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: ఐకేపీ ఆధ్వర్యంలో చెన్నపురావుపల్లిలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం అరుణ ప్రారంభించారు. రైతులను ఇబ్బంది పెట్టకుండా ఎప్పటికప్పుడు ధాన్యాన్ని కొనుగోలు చేసి రశీదులు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో మహిళలు, రైతులు పాల్గొన్నారు.



పెద్దకొత్తపల్లి మండలం చెన్నపురావుపల్లిలో ..



నాగర్‌కర్నూల్ మండలం గగ్గలపల్లిలో..

ఆలయాల అభివృద్ధికి కృషి: మాజీ ఎమ్మెల్యే



ఈదమ్మ గుడి వద్ద హర్షవర్ధన్‌రెడ్డితో బీఆర్‌ఎస్ నాయకులు

కొల్లాపూర్: ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. తన స్వంత డబ్బులతో చేపట్టిన ఈదమ్మ గుడి పునర్నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పనులను హర్షవర్ధన్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. పనుల గూర్చి రైతు కమిటీ నాయకులతో చర్చించారు. ఆయన వెంట నాయకులు నరేందర్ రెడ్డి, సాకలి నర్సింహ, సాంబశివుడుయాదవ్, కట్టా శ్రీనివాసులు, జాఫర్, భాస్కర్‌రావు, వెంకటస్వామి, అహ్మద్‌ఘోరీ, బిజ్జవేణు, శ్రీనివాస్‌యాదవ్ తదితరులున్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కొల్లాపూర్: పట్టణంలో ఇటీవల కాలంలో మరణించిన, ప్రమాదాల్లో గాయపడ్డ పలు బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. పట్టణంలోని 18 వ వార్డులో ఇటీవలనే అనారోగ్యంతో మరణించిన జలకం లక్ష్మయ్య కుటుంబాన్ని పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన 18వ వార్డుకు చెందిన డీజే బాలును, 10వ వార్డుకు చెందిన హుస్సేన్ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

కోడేరు: మండల కేంద్రంలో బురాన్ 15 రోజుల కిందట మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని బుధవారం మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పరామర్శించారు. అనంతరం జంపుల శివ అనారోగ్యంతో మృతిచెందడంతో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని నాగులపల్లి తండాకు చెందిన హనుమంతునాయక్ గుండెపోటుతో మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని సింగిల్ విండో డైరెక్టర్ మల్లెపల్లి జగన్మోహన్‌రెడ్డి పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో దూరెడ్డి రఘువర్ధన్‌రెడ్డి, శ్రీశైలం, మిద్దె రాజు, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

సర్వేను పరిశీలించిన అధికారులు



ఎన్‌జీఓ కాలనీలో సర్వేలో వివరాలను అడిగి తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ దేవసహాయం



తాడూరులో..

కల్వకుర్తి టౌన్: ఇంటింటి సర్వేలో భాగంగా చేపడుతున్న సర్వే ఫారంలో కోడ్ నంబర్ల వద్ద విధిగా వివరాలు నమోదు చేయాలని అదనపు కలెక్టర్ దేవసహాయం అన్నారు. బుధవారం పట్టణంలోని మహబూబ్‌నగర్ రోడ్డులోని ఎన్‌జీఓ కాలనీలో ఇంటింటి కుటుంబ సమగ్ర సర్వేను ఆయన పరిశీలించారు. వివరాలను తీసుకునే సమయంలో కోడ్‌ల విషయంలో ఏవైనా సందేహాలుంటే విధిగా నోడల్ అధికారులను గాని, జిల్లా యంత్రాంగంతో మాట్లాడి నమోదు చేయాలని ఎన్యుమరేటర్లకు సూచించారు. ఆయన వెంట కల్వకుర్తి మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్, టీపీఓ వికాస్, ఎన్యుమరేటర్లు, సిబ్బంది ఉన్నారు.

కల్వకుర్తిరూరల్: మండలంలోని 24 గ్రామ పంచాయతీల పరిధిలో సమగ్ర సర్వే కార్యక్రమం బుధవారం కొనసాగింది. మండలంలోని కుర్మిద్దలో సర్వేను ఎంపీడీఓ వెంకటరాములు పరిశీలించారు. ఎన్యుమరేటర్లు నమోదు చేసిన దరఖాస్తులను పరిశీలించి పలు సూచనలు సలహాలు ఇచ్చారు.

తాడూరు: మండల కేంద్రంతో యాదిరెడ్డిపల్లి, గుంతకోడూరు, అంతారం గ్రామాలలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను ఎంపీడీఓ బ్రహ్మాచారి, తహసీల్దార్ కిరణ్మయి పరిశీలించారు.

చారకొండ: మండలంలోని జూపల్లి, సారంబండ తండా గ్రామాలను ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ సర్వే ప్రక్రియను పరిశీలించారు. దరఖాస్తులను పరిశీలించారు. ఇంటి యజమానులు సర్వేకు సహకరించాలని కోరారు. ఎంపీఓ వెంకటేష్ ఉన్నారు.



కల్వకుర్తిలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకటరాములు

ఉప్పునుంతల: మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు సర్వేపై ఆసక్తి చూపడం లేదు. ఎన్యుమరేటర్లు వచ్చే సమయానికి కూలీలకు వెళ్లడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఎన్యుమరేటర్లు మధ్యాహ్నం తర్వాత రావడంతో అప్పటికే పలు గ్రామాలకు పత్తి తీసేందుకు వెళ్తున్నారు. వారి కోసం గంటల తరబడి వేచి చూసి వారి నుంచి వివరాలు సేకరిస్తున్నారు.

తిమ్మాజిపేట: మండలంలోని 26 గ్రామ పంచాయతీలలో 81 మంది ఎన్యుమరేటర్లు సర్వే నిర్వహిస్తున్నారు. మండలంలోని మరికల్‌లో ఎంపీడీఓ లక్ష్మీదేవితోపాటు మండల స్థాయి అధికారులు 10 మంది సూపర్‌వైజర్లు పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటివరకు 3807 కుటుంబాల సర్వే పూర్తి చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.



చారకొండలో..



ఉప్పునుంతలలో..

ముగిసిన కేంద్ర బృందం పరిశీలన



కల్వకుర్తిరూరల్: మండలంలోని జీడిపల్లిలో సంసద్ ఆదర్శ గ్రామీణ యోజన పథకంలో భాగంగా గ్రామానికి వివిధ శాఖల ద్వార మంజూరైన నిధులపై సెంట్రల్ అకాడమిక్ మానిటరింగ్ కోఆర్డినేటర్ సురేష్ ఆధ్వర్యంలో చేపట్టిన కేంద్ర బృందం పరిశీలన బుధవారం ముగిసింది. అదేవిధంగా కుర్మిద్దలో కేంద్రబృందం పరిశీలన చేపట్టింది. జీడిపల్లి మాజీ సర్పంచ్ కల్పన కృష్ణయ్య వారిని సన్మానించారు. మాజీ ఉపసర్పంచ్ ఖాజా, వార్డు సభ్యులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



పెద్దకొత్తపల్లి: మండలంలోని ముష్టిపల్లికి చెందిన ఇటీవల రాములమ్మ మృతిచెందింది. బుధవారం కాంగ్రెస్ నాయకుడు జగదీశ్వర్‌రావు బాధిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్ సింగోటం, బత్తుల రాజశేఖర్, నర్సింహ, శ్రీకాంత్, రమేష్, కృష్ణమోహన్, రాములు, ఉపేంద్ర, లక్ష్మన్ పాల్గొన్నారు.

పెండింగ్‌లో కేసులు ఉండొద్దు

కోడేరు: కేసులు పెండింగ్‌లో ఉండకుండా చూడాలని డీఎస్పీ శ్రీనివాస్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మెలగాలన్నారు. మాదక ద్రవ్యాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ గోకారి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన రైతులను విడుదల చేయాలి

కొల్లాపూర్: వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలో ఫార్మా కంపెనీకి భూములు ఇచ్చేందుకు నిరాకరించిన రైతులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం తగదని లంబాడి హక్కుల పోరాటసమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రుడావత్ రవినాయక్ అన్నారు. బుధవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బంధువులకు పేదల భూములను కట్టబెట్టేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. అమాయకులైన గిరిజన రైతులను అరెస్టులు చేస్తూ ఊరుకోమని హెచ్చరించారు. వెంటనే రైతులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలు

నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలో రాంనగర్ కాలనీలో సీతారామచంద్రస్వామి ఆలయంలో బుధవారం మహిళలు కార్తీక దీపాలను వెలిగించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మహిళలకు అభిషేకాలు చేసి తీర్థప్రసాదాలు అందించారు.

విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ



యూనిఫాం అందజేస్తున్న ప్రిన్సిపాల్ రాఘవేంద్ర

సాక్షి ఎఫెక్ట్..

కోడేరు: మండల కేంద్రంలోని మాడల్ స్కూల్ విద్యార్థులకు 'యూనిఫాం పంపిణీ చేయాలి' అనే శీర్షికతో బుధవారం సాక్షిలో వార్త ప్రచురితం అయ్యింది. దీనికి ప్రిన్సిపాల్ రాఘవేంద్ర స్పందించి విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ ప్రారంభమైనప్పుడు మొదటి విడతగా 8, 9, 10వ తరగతి విద్యార్థులకు ఒక జత పంపిణీ చేశామని, రెండో విడత డిసెంబర్‌లో పంపిణీ చేస్తామన్నారు. 6, 7వ తరగతులకు సంబంధించిన 90 మంది విద్యార్థులకు యూనిఫాం అందజేశారు. మొత్తం 322 మంది విద్యార్థులకు యూనిఫాం అందిస్తామన్నారు. కుట్టుమిషన్ నిర్వాహకులు ఆలస్యం కారణంగా యూనిఫాం పంపిణీకి జాప్యం ఏర్పడిందన్నారు. అంజలయ్య, శ్రీనివాసచారి, పద్మ, ఉదయశ్రీ, రాణి, శ్రీవల్లి, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంపై ప్రభుత్వం చిన్నచూపు



పెచ్చులూడిన తరగతి గదిని పరిశీలిస్తున్న బీఎస్‌ఎఫ్ నాయకులు

తెలకపల్లి: విద్యారంగంపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని బీఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ విమర్శించారు. బుధవారం మండలంలోని కార్వంగలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను బీఎస్‌ఎఫ్ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో సమస్యలు తాండవిస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తరగతి గదుల పైకప్పు పెచ్చులు ఊడి కిందపడుతున్నా అధికారులు నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలలో సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం అయ్యిందన్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. లేని పక్షంలో అన్ని విద్యార్థి సంఘాలను కలుపుకొని ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మద్దెలబండ సాయిబాబు, నాగరాజు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో వ్యక్తికి జైలుశిక్ష

నాగర్‌కర్నూల్ క్రైం: డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి జరిమానాతో పాటు జైలుశిక్ష కోర్టు విధించినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ బుధవారం తెలిపారు. తాడూరు మండలం ఇంద్రకల్ గ్రామానికి చెందిన వెంకటేష్ ఈనెల 9న మద్యం తాగి ఆటో నడుపుతుండగా జిల్లా కేంద్రంలోని ట్యాంక్‌బండ్ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా డ్రంకన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. పోలిసులు బుధవారం న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చగా విచారించి రూ.3 వేలు జరిమానాతో పాటు 10 రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ



వెల్దండ: మండలంలోని రాఘయపల్లి గ్రామానికి చెందిన సెవ్వ అంజయ్యకు సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి రూ.48వేలు మంజూరయ్యాయి. బుధవారం సింగిల్‌విండో డైరెక్టర్ నాగులు నాయక్ బాధిత కుటుంబానికి చెక్కు అందజేశారు. సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరంగా మారిందన్నారు. కార్యక్రమంలో నాయకులు కొండల్‌యాదవ్, ఈదమయ్య, రామచంద్రయ్య తదితరులు ఉన్నారు.

కోడేరు: మండలంలోని రాజాపూర్ గ్రామానికి చెందిన సంగనమోని రాము, కవితలకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణ బుధవారం అందజేశారు. చెక్కుల మంజూరుకు కృషి చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

భజన మండలి బృందానికి సన్మానం



లింగాల: కార్తీక మాసం సందర్భంగా నెల రోజుల పాటు మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించే ఆకు పూజలు, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలలో భాగస్వాములు అవుతున్న భజన మండలి సభ్యులను బుధవారం ఆలయం ఆవరణలో ఘనంగా సన్మానించారు. మండల కేంద్రానికి చెందిన రిటైర్డు సీఐ కావేటి వెంకట్రాం కుటుంబ సభ్యులు భజన మండలిని శాలువాలు కప్పి సన్మానించారు. ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నల్గొండ శ్రీనివాసులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

కల్వకుర్తిరూరల్: సమాజంలోని ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన అవసరమని సఖీ కేసు వర్కర్ అరుణ, జెండర్ స్పెషలిస్ట్ వెంకటమ్మలు కోరారు. బుధవారం మండలంలోని మార్చాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఆడపిల్లలను రక్షిద్దాం, ఆడపిల్లలను చదివిద్దాం అనే పిలుపుతో పాటు విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలనే సంకల్పంతో సఖీ జిల్లా కేంద్రం ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రధానంగా ప్రస్తుత సమాజంలో బాలికలు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కల్పించారు. ఏదైన సమస్యలు ఉంటే 181, 1098 నంబర్‌లకు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మల్లీశ్వరి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిరంజీవి, వెంకటరమణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో మేక పిల్లలు మృత్యువాత



విలపిస్తున్న బాధితులు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని అంజనగిరిలో కుక్కల దాడిలో 10 మేకలు మృత్యువాత పడిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం కాటం అంజనేయులుకు సంబంధించిన 10 మేకలను ఇంటి దగ్గర ఉంచి బయటకు వెళ్లాడు. పనులు ముగించుకొని ఇంటికి వచ్చేసరికి అప్పటికే మేకలపై కుక్కలు దాడి చేసి చంపివేశాయి. చనిపోయిన మేకలను చూసి బాధితులు బోరున విలపించారు. మృతిచెందిన మేకల విలువ రూ. 50 వేల వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

పేద విద్యార్థులు చదువుకు దూరం



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎల్ మూర్తి

కల్వకుర్తిరూరల్: ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో పేద విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎల్ మూర్తి అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ఫీజుల కోసం విద్యార్థులను వేధిస్తున్నాయని తెలిపారు. ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ. 8,600 కోట్ల స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తారాసింగ్, జమాలుద్దీన్, సాయిచరన్, రెహమాన్, చరణ్, భాను పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా అందించాలి

పాన్‌గల్: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం నాణ్యతగా అందించాలని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు దొండాయిపల్లి, కొత్తపేట ప్రాథమిక, దావాజిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలను మానిటరింగ్ టీంతో కలిసి ఎంఈఓ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లు, అకాడమిక్ రిజిస్టర్లు, తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా తరగతుల వారీగా విద్యార్థుల సామర్థ్యాలు, మధ్యాహ్న భోజనం నాణ్యతను వారు పరిశీలించారు. హెచ్‌ఎంలు, సీఆర్పీలు గోవింద్, రమాదేవి పాల్గొన్నారు.